ప్రజాశక్తి
శనివారం 13 మే 2023
5
విజయనగరం

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. అదాలత్‌లో సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్, బ్యాంకు కేసులు, ప్రామిసరీ నోట్, విద్యుత్ , మొదలగు కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి పాల్గొన్నారు.

చాపకింద నీరులా

ఆస్తిపన్ను బాదుడు

- పట్టణాల్లో మరో 15శాతం పెంపు
- నగర ప్రజలపై అదనపు భారం రూ.2 కోట్లపైనే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు చెందిన ఒకరు తన ఫ్లాట్‌కు 2020-21 వరకు ఏడాదికి రూ.6,400 ఆస్తి పన్ను చెల్లించేవారు. ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్ను విధానం అమలులోకి వచ్చాక 2021-22లో పన్ను రూ.7,360(15శాతం) పెరిగింది. మరోసారి (2022-23) 15శాతం పెంచడంతో పన్ను రూ. 8,464 అయ్యింది. అంటే రెండేళ్ల వ్యవధిలో పన్ను రూ.2,064 (82.25శాతం పెరిగింది). పట్టణాల్లో ఆస్తి పన్ను మరోసారి పెరిగింది. ఆస్తి మూలధన విలువ ఆధారంగా పెరిగిన పన్నుకు సమానమయ్యే వరకు ప్రజలపై ఏటా చాపకింద నీరులా ఆస్తిపన్ను పెంచడంతో నగర ప్రజలకు దెబ్బ మీద దెబ్బపడుతూనే ఉంటుంది. గత రెండేళ్లలోనే 32.24 శాతం పన్ను పెరగడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆస్తిపన్ను చెల్లించేందుకు సచివాలయాలకు, కార్పొరేషన్ కార్యాలయానికి వెళు తున్న వారికి అధిక మొత్తం చెల్లించాలని సిబ్బంది చెప్పంతో విస్తుపోతున్నారు. 2022-23లో పెంచిన పన్నుతో పట్టణ ప్రజలపై రూ.2కోట్లకుపైగా అదనపు భారం పడనుంది.

విజయనగరం కార్పొరేషన్‌లో పన్నుల భారం ఏటా పెరుగుతోంది. అన్ని రకాల పన్నుల భారంతో ప్రజలు సతమతమవుతున్నారు. కోవిడ్ ప్రభావంతో ఆర్థికంగా దెబ్బతినడం, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, విద్యుత్తు ఛార్జీల మోతతో ప్రజలు కొంతకాలంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ 2021-22లో పెరిగిన 15శాతం ఆస్తి పన్నును మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థ గత నెలాఖరు వరకు వసూలు చేశాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేసి పన్నులు చెల్లించి ఇంకా ఊపిరి పీల్చుకోకముందే చాపకింద నీరులా పన్ను మరోసారి పెంచారు.

నగరానికి చెందిన ఒక వ్యాపారి తన వాణిజ్య భవనానికి 2020-21లో ఏడాదికి రూ.9,600 ఆస్తి పన్ను చెల్లించేవారు. 2021-22లో రూ.11,040 చెల్లించారు. 2022-23లో మరో 15శాతం పెంచి రూ.12,696 చెల్లించాలని పురపాలకశాఖ నోటీసు ఇచ్చింది. రెండేళ్ల వ్యవధిలో పన్ను రూ.3,096 (32.25శాతం) పెరగడంతో ఆయన గగ్గోలు పెడుతున్నారు.

అలకానంద కాలనీకి చెందిన ఒకరు తన ప్లాట్‌కు ఏడాదికి రూ.5,600 చొప్పున ఆస్తి పన్ను చెల్లించేవారు. కొత్త విధానం అమలులోకి వచ్చాక 2021- 22లో ఆయన చెల్లించాల్సి పన్ను రూ. 6,445కి పెరిగింది. దీనిపై మరోసారి 15శాతం పెంపుతో 2022-23లో రూ.7,418 చెల్లించాల్సి వచ్చింది. రెండేళ్లలో పన్ను రూ.1,818 పెరిగింది. పన్ను పెంపు విషయం నగర ప్రజలకు తెలియజేయకుండానే వసూలు చేయడంతో ప్రజలు మండిపడుతున్నారు. నగరంలో 64వేల ఎసెస్మెంట్‌ల నుంచి పన్నులు వసూలు చేశారు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది పన్నుల వసూలులో పురోగతి కనిపిస్తోంది. పాత బకాయిలు, మొండి బకాయిలు ,కోర్టు కేసులు ఉన్నవి వాటి నుంచి ఈ ఏడాది సుమారుగా 15 కోట్లు వరకు అదనంగా వసూలైంది.

అందరికీ 15 శాతం పన్ను అమలు కాదు

ఆస్తిపన్ను పెంపు 15 శాతం అందరికీ అమలు కాదని, క్యాపిటల్ విలువ వరకు వచ్చే వారికి 2 శాతం నుంచి 15 శాతం మధ్యలో కట్టాల్సి వస్తుందని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. క్యాపిటల్ విలువ కు చేరుకున్న తర్వాత కేవలం 2శాతం మాత్రమే పెరుగుతుందని తెలిపారు. దీనిని నగర ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆస్పత్రి ఖాళీ లేక బయట బెంచీలపై పడుకోబెట్టి సెలైన్ ఎక్కిస్తున్న వైద్య సిబ్బంది; ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

పెళ్లి విందులో కలుషిత ఆహారం తిని

600 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో వివాహ విందులో కలుషిత ఆహారం తిన్న సుమారు 600 మంది అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం విందులో పాల్గొన్న వారందరికీ సుమారు నాలుగు గంటల ప్రాంతంలో వాంతులు మొదలయ్యాయి. ఫుడ్ పాయిజన్ జరిగిందన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కొక్కరు ఆసుపత్రి పరుగులు తీశారు. పిల్లల్ని ఎత్తుకుంటూ ద్విచక్ర వాహనాల్లో కుటుంబాల సమేతంగా ఆసుపత్రులకు చేరుకోవడంతో ఒక్కసారిగా ఆసుపత్రి కిక్కిరిసి పోయింది. వైద్యులు ప్రాథమిక చికిత్స అందిస్తూనే పరిస్థితి విషమించి వారిని భోగాపురం మండలం సుందరపేట ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు మహంతి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ టి. సీతారాం అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గ్రామస్తులంతా ఆసుపత్రికి చేరుకుంటే సహాయం చర్యలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని, అస్వస్థతకు గురైన వారంతా గ్రామంలోనే ఉండాలని తెలిపారు. గ్రామాలకు వెంటనే గోవిందపురం, రెల్లివలస పిహెచ్‌సిల వైద్యసిబ్బందిని తరలించారు. పూసపాటిరేగ ఆసుపత్రికి ఎస్‌ఐ ఎ.నరేష్‌తో పాటు పోలీసులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సుందరపేట ఆస్పత్రికి కూడా నిండిపోవడంతో కొవ్వాడ పాఠశాలలో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. తాగునీటి వల్ల ఆహారం కలుషితమై ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈఘటనపై కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి వారంతా కోలుకునేలా పర్యవేక్షించాలని ఆర్‌డిఒకు ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆర్‌డిఒ సూర్యకళ, డిఎంహెచ్‌ఒ రమణకుమారి, డిఎస్‌పి కాళిదాసు, తహశీల్దార్ భాస్కరరావు ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మెరుగైనవైద్యసేవలు అందించాలని ఆర్‌డిఒ వైద్యాధికారులకు సూచించారు. అస్వస్థతకు గురైన వారు అధికంగా ఉండడంతో ప్రత్యేక వైద్యశిబిరాలను నియమించారు. భోజనం ఎక్కడి నుంచి వచ్చింది? ఎంతమంది తిన్నారు? వంటి అంశాలపై ఆర్‌డిఒ ఆరా తీశారు. పెళ్లిలో ఆహార పదార్థాలపై పూర్తి సమాచారం ఇవ్వాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. సంఘటన జరిగిన సమయం సాయంత్రం కావడం, అధికారులు అందుబాటులో లేకపోవడంతోఎంపిపి భర్త మహంతి శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటనా గ్రామానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మండలంలోని పరిశ్రమలకు ఫోన్ చేసి అంబులెన్సులు పంపాలని కోరారు.వాటిలో బాధితులను సుందరపేట ఆస్పత్రికి తరలించారు. పెళ్లిలో బిరియాని కలుషితం కావడం వల్లే అవస్థతకు గురైనట్లు వైద్యాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా చికిత్స అందించారు.

కొవ్వాడ అగ్రహారంలో విషాదం
బాధితులకు ఆర్‌డిఒ,డిఎస్‌పి పరామర్శ

మొక్కజొన్న కొనుగోలును పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్

మొక్కజొన్న కొనుగోలు వేగవంతం

దళారులను ఆశ్రయించవద్దు : జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-జామి

మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. జామి మండలం అన్నంరాజుపేట ఆర్‌బికెలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులతో, సిబ్బందితో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మొక్కజొన్నకు క్వింటాకు రూ.1962 చొప్పున ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధరను అందిస్తోందని, దీనిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతులు దళారుల బారిన పడవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే మొక్కజొన్న విక్రయించాని జెసి సూచించారు. ఈ పర్యటనలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వై.విమల, తాశిల్దార్ హేమంత్‌కుమార్, ఏఓ కిరణ్‌కుమార్, ఇతర సిబ్బంద పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికే

జగనన్నకు చెబుదాం

అధికారుల దృక్పథంలో మార్పు రావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, వారిని శతశాతం సంతృప్తి పరచడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై జిల్లా అధికారులకు అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సంతప్త స్థాయిని పెంచడానికి, ప్రభుత్వపరంగా మరింత మెరుగైన సేవలను పౌరులకు అందించే లక్ష్యంతో స్పందన కార్యక్రమాన్ని జగనన్నకు చెబుదాంగా మార్పు చేసిందన్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపైనా వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటుందని, ప్రతీ సమస్యను సంపూర్ణంగా అధ్యయనం చేయాలని అన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన స్పందన కార్యక్రమం వేరని, జగనన్నకు చెబుదాం కార్యక్రమం దీనికి విభిన్నంగా ఉంటుందని, కొత్త కోణంలో చూడాలని సూచించారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపైనా ముఖ్యమంత్రి కార్యాలయం స్థాయిలో పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. అందువల్ల ప్రతీ ఫిర్యాదుపైనా సంబంధిత అధికారి వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో వ్యవహరించే విధానం మార్చుకోవాలని, వారు చెప్పింది ఓపికగా విని సమస్యను అర్థం చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వారి సమస్యలను పరిష్కరించి, ప్రజల సంతప్త స్థాయిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.గణపతిరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం

- 18న ఎస్.కోటకు టిడిపి అధినేత చంద్రబాబు రాక
- గొంప కృష్ణ ఆధ్వర్యాన ఏర్పాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తెలుగు తమ్ముళ్లల్లో నూతనుత్తేజం కనిపిస్తోంది. ఈనెల 18న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు గొంప కృష్ణ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తున్నారు. 'ఇదేం ఖర్మం' పేరిట చంద్రబాబు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో రాజాం, బొబ్బిలి, విజయనగరం నియోకవర్గాల్లో పర్యటించిన విషయం విధితమే. మార్గ మధ్యంలో గజపతినగరం, నెలిమర్ల నియోజకవర్గాల్లో కూడా ఆగి శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంకా చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో పర్యటన పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలోని కొన్ని నియోకవర్గాలపాటు ఆ జిల్లాకు ఆనుకునివున్న ఎస్.కోట నియోజకవర్గంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఎస్.కోట పట్టణంలోని ఆకులడిపో వద్ద బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార పార్టీతోపాటు టిడిపిలోని ఈ కీలక నేత కూడా అక్కడి సభ జరగనీయకుండా అడ్డుపుల్ల వేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో గొంప కృష్ణ ఆధ్వర్యాన కొంతమంది నియోకవర్గ నాయకులు మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఎలాగైనా వేలాది మందితో సభ నిర్వహిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేసితీరుతామని చెబుతున్నారు. ఆ రోజు రాత్రికి చంద్రబాబు బస ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. సోంపురం, వేపాడలో కూడా బాబు ఓపెన్ టాప్‌లో వాహనంలో మాట్లేందుకు అవకాశం ఉంది. ఒకప్పుడు ఎస్.కోట కంచుకోటని, తిరిగి పూర్వవైభవం తీసుకురావాలంటూ చంద్రబాబు చెప్పున్నట్టుగా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటనపై జిల్లా వాప్తంగా ఆసక్తికర చర్చ నడుస్తోంది. పర్యటన నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లల్లో జోష్ కనిపిస్తోంది.

సిబిఎస్ఇ ఫలితాల్లో

కేంద్రీయ విద్యార్థుల హవా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు తమ సత్తా చాటారు. టెన్త్ ఫలితాల్లో జి.మయూఖ 95.33 శాతంతో ప్రథమ స్థానం, ఆర్.చరణ్ తేజ 93. 67శాతంతో ద్వితీయ స్థానం, ఆర్. సాత్విక 93.33 శాతంతో తృతీయ స్థానంలో నిలిచారు. 12వ తరగతి ఫలితాలలో డి. మీనాక్షి 93.83శాతంతో ప్రథమ స్థానం, వి. మదన్‌రామ్ సాయి 87.17శాతంతో ద్వితీయ స్థానం, హొరెయిస్ వాహబ్ 87శాతంతో తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి విజయానికి కారణమైన తల్లితండ్రులను, అధ్యాపక బృందాన్ని విద్యాలయ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు అభినందించారు. 12వ తరగతిలో ప్రవేశాలకు శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఫోర్టు సిటీ విద్యార్థుల ప్రతిభ

సిబిఎస్ఇ 9వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫోర్టుసిటీ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేసారు. పరీక్షకు హాజరైన 86 మంది విద్యార్థుల్లో రెడ్డి హాసిని 491/500 మార్కులు సాధించి పాఠశాల టాపర్ గా నిలిచింది. తమ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణంగా వుందని పాఠశాల చైర్మన్ కెవిపి రాజు (శివ) అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినందనలు తెలిపారు.

'సత్య' విద్యార్థులకు కరాటేలో పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటే కోచ్ కె.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అనకాపల్లిలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్విటేషనల్ కెన్యు రియూ కరాటే ఛాంపియన్షిప్‌లో పాల్గొని పలు పతకాలు సాధించారు. ఎస్.శ్రీకాంత్ కాటా, కుమిటిలో స్వర్ణ పతకం, పి.హేమంత్ రజితం, కె.భువనకృతి కాటాలో స్వర్ణం, కుమిటిలో రజిత పతకం, కుశలకుమార్ రజిత పతకం, పి.కుష్వంత్ కుమార్ , బి.హస్వంత్ కాటాలు రజిత పతకం,. కుమిటీలో కాంస్య పతకం సాధించారు. పి సాత్విక కుమారి, టి. జాగృతి కుమారి, టి.తేజశ్రీ, శివ శ్రీ హర్ష, బి. షణ్ముఖ శ్రీకర్, టి.మోక్షిత్, కె.హేమంత్ వీరంతా కాటా మరియు కుమిటి విభాగంలో కాంస్య పథకాలు గెలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల సంచాలకులు డాక్టర్. ఎం. శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్యవేణి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు

రెండువారాల్లోగా భవనాలు అప్పగించాలి
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ప్రభుత్వ భవనాల పనులను పూర్తి చేసి రెండు వారాల్లోగా ఆయా శాఖలకు అప్పగించాలని కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో మరింత పురోగతి కనిపించాలని, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత కాలంలో చేరుకోవాలని సూచించారు. కారణాలు చెబుతూ కాలయపాన చేసే ఆలోచన నుంచి అధికారులు బయటకు రావాలని నిర్దేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ రాజ్ విభాగం, డిపిఒ, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరుపై కలెక్టర్ ఆరా తీశారు. మండల వారీగా సమీక్ష నిర్వహిస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.జల్ జీవన్ మిషన్ లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేయాలని, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఆన్లైన్ ప్రక్రియలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వీలైనంత అధిక మందికి ఉపాధి పని దినాలు కల్పించాలన్నారు.సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను, వెల్‌నెస్ సెంటర్లను రెండు వారాల్లోగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, పిఆర్ఎస్ఇ ఆర్ఎస్ గుప్తా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, డిపిఒ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగక్ష్మి

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం దిగ్విజయంగా, నిరాటంకంగా కొనసాగుతుందని అన్నారు. నగరంలోని 30 వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ప్రజల నుండి కూడా ప్రభుత్వం పై స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జ్ మారెం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ 30 వ డివిజన్ పరిధిలో 2 కోట్ల రూపాయలతో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్చార్జి పూసర్ల శ్రీనివాసరావు, చందక ఆదిలక్ష్మి, సువ్వాడ జయరాం పాల్గొన్నారు.

43వ డివిజన్ ఉడాకాలనీ ఫేజ్ 1లో రూ.15.70 లక్షలతో చేపట్టిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కార్పొరేటర్ దాసరిసత్యవతి సురేష్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు శంకరరావు, రవికుమార్

అక్రమ వాటర్ ప్లాంట్లను సీజ్ చెయ్యండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోగల అయ్యప్పనగర్ స్వామీ లే అవుట్ లో ఉన్న అక్రమ వాటర్ ప్లాంట్ లను వెంటనే సీజ్ చేయాలని భూ గర్భ జల వనరుల శాఖ అధికారి దుర్గా ప్రసాద్‌కు పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా విజయనగరం అపార్ట్ మెంట్లు కాలనీస్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవి కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయ కూడదని అన్నారు. రాజకీయ పలుకబడితో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అది అక్రమమే అవుతుందని అన్నారు. ఆ వాటర్‌ప్లాంట్ వల్ల చుట్టుపక్కల ఇళ్లకు చెందిన బోర్లు ఇంకిపోతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు కలుగ చేసుకుని వాటర్ ప్లాంట్‌లను రద్దు చేయాలని కోరారు, భూ గర్భ జల వనరులు శాఖా అధికారి దుర్గా ప్రసాద్ స్పందిస్తూ తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిఎం కప్ కబడ్డీ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం

విజయనగరం టౌన్: మే 1 తేదీ నుండి 5 తేది వరకు తిరుపతిలో జరిగిన ఎపి సిఎం కప్ కబడ్డీ టోర్నమెంట్ లో ద్వితీయ స్థానం సాధించిన మహిళల జట్టు కు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ , కార్యదర్శి సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాస రావు, అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

మృతుల కుటుంబాలకు ప్రాధాన్యతివ్వాలి

కిల్లంపల్లి రామారావు

నెల్లిమర్ల : గ్రాట్యుటీ చెల్లింపులో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ 2016 నుంచి ఎంతో మంది కార్మికులు అనారోగ్యం ఇతర కారణాలతో మృతి చెందారని వారికి జ్యూట్ యాజమాన్యం ప్రాధాన్యమిచ్చి గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జ్యూట్ యాజమాన్యం రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుకూల యూనియన్ సిఫార్సు చేసిన వారికి గ్రాట్యుటీ బకాయిలు చెల్లించడం దుర్మార్గమన్నారు. పని చేస్తూ మృతి చెందిన కార్మికులకు మొదటి ప్రాధాన్యత, రిటైర్ అయ్యి మృతి చెందిన వారికి రెండవ ప్రాధాన్యత, తరువాత సీనియారిటీ ప్రకారం రిటైర్డ్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ బకాయి చెల్లించక పోవడం వల్ల ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాట్యుటీ చెల్లింపులో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కార్మికులు సహించబోరని హెచ్చరించారు.

రేపు ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు

బొబ్బిలి : రేపు విశాఖలో సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ అభిమాని బంటు అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ద్వారకనగర్‌లో ఉన్న పౌర గ్రంథాలయంలో శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ జరుగుతుందన్నారు. శత జయంతి ఉత్సవాలకు తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఎన్.లక్ష్మీపార్వతి, సినీ గాయకులు హాజరవుతారని, జయప్రదం చేయాలని కోరారు.

నగదును అందిస్తున్న కర్రోతు బంగార్రాజు

కనకదుర్గమ్మ ఆలయానికి రూ.25 వేలు విరాళం

భోగాపురం : మండలంలోని చేపల కంచేరు పంచాయతీ ఎర్రముసలయ్యపాలెం గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం నిర్మాణం కోసం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు రూ. 25వేలు విరాళాన్ని శుక్రవారం ఆ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలపు అప్పలరామి రెడ్డి, టిడిపి మహిళ నాయకురాలు ఎలయ్యమ్మ, మండల పృథ్వీ రాజ్ పాల్గొన్నారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి : ఐటిఐ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6 సాయంత్రం 5గంటలు లోగా ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, డ్రాఫ్ట్‌మెన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు

పుస్తకాలు వితరణ

శృంగవరపు కోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 12 రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో జానా శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి అన్నదమ్ములు కేశవ, గోవిందలు శుక్రవారం 75మంది క్రీడాకారులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఆర్మీ వెంకట్రావు, పాఠశాల పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు పొట్టా కళ్యాణి, కోచ్‌లు బి.హారిక, పి.మౌనిక, క్రీడాకారులు పాల్గొన్నారు.


సర్వేను ప్రారంబిస్తున్న వైస్ చైర్మన్ రామారావు

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

నెల్లిమర్ల: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు తెలిపారు. శుక్రవారం నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో డ్రోన్ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో ప్రభుత్వ భూములు, జిరాయితీ భూముల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రీ సర్వేను ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నల్లి శ్రీను, పోలుబోతు నారాయణ మూర్తి, ఎం ఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, తుమ్ము నారాయణ మూర్తి, సచివాలయం అడ్మిన్ లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

104 సిబ్బంది నిరసన

వేపాడ: నిరసన తెలుపుతున్న సిబ్బంది

వేపాడ : స్థానిక పిహెచ్‌సిలో పనిచేస్తున్న 104 సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు అందక అప్పులు పాలై ఆర్థిక ఇబ్బం దులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన వేతనాలను ఇప్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

శృంగవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోతనపల్లిలో 104 పైలెట్ కోటారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ మహాలక్ష్మి నల్ల బ్యాడ్జీలు ధరించి, కాళీ కంచాలు పట్టుకొని నిరసన తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా 104 ఉద్యోగుల సమస్యలు తెలుసుకునీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- మెంటాడ

సమస్యలను తెలియపరిస్తే పరిష్కార చర్యలు చేపడతామని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం పెదమేడ పల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందిన విధానం చేకూర్చిన లబ్ధి వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్ లెట్లను పంపిణీ చేశారు. పథకాలు అందని వారిని కలిసి సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టడానికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, గ్రామ సర్పంచ్ బోనెల ప్రకాష్ము వైసిపి సీనియర్ నాయకులు వైస్ సర్పంచ్ పొరికిరెడ్డి అప్పలనాయుడు, మరడ సింహాచలం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పూసపాటిరేగ : వైసిపి ప్రభుత్వం హయాంలో గడపగడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నెలిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన పతివాడ లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అదే తీరుపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దన్ రావు, వైస్ ఎంపిపి చింతలరాజు, గ్రామ గృహ సారథులు, వాలంటీర్ల తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అని అడిగారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, ఎఎంసి చైర్మన్ కస్తూరి, వైస్ ఎంపిపి అదపా ఈశ్వరరావు, వల్లంపూడి ఎంపిటిసి, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు ఈద్లే సన్యాసినాయుడు, వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, సోంపురం గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడలో ప్రభుత్వ భూమిని వైసిపి నాయకుల ఆక్రమిస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పడాల చిన్నారావు, కొరాడ రమణ, గౌరీ తహశీల్దార్ ఆదిలక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 101, 23లో సుమారు రెండున్నర ఎకరాలు చదును చేసి ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఇదే భూమి ఆక్రమణకు గురైతే తహశీల్దార్ ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి ఆ భూమిలో ప్రభుత్వ భూమిగా బోర్డు పెట్టడం కూడా జరిగిందన్నారు. ఇప్పుడు ఆ బోర్డును తొలగించి వైసిపి నాయకులు ఆక్రమించుకొని సైట్లు వేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. లేకపోతే సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే కోర్టుకు వెళ్లామని తెలిపారు.

హైకోర్టు తీర్పుతో సిఎంకు కనువిప్పు కలగాలి

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1పై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో సిఎంకు కనువిప్పు కలగాలని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు పాదయాత్ర చేసినప్పుడు ఇలాంటి జీవోలు తెస్తే అప్పుడు వాళ్ల పాదయాత్ర చేసేవారా అని ప్రశ్నించారు. జీవోను హైకోర్టు రద్దు చేయడం పట్ల టిడిపి పార్టీ తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు నారా లోకేష్ పాదయాత్ర మొదలుపెట్టి ఈనెల 15వ తేదీకి వంద రోజులు కావస్తుండడంతో ఆయనకు మద్దతుగా నియోజకవర్గస్థాయిలో సుమారు 3000 మందితో నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్ నుంచి రామ్ తీర్థాలు గుడి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఈ పాదయాత్రలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిఒ నెంబర్ ఒకటి రద్దు ప్రతిపక్షాల గెలుపు: కోళ్ల

శృంగవరపు కోట: జిఒ నెంబర్ ఒకటి రద్దు ప్రతిపక్షాల గెలుపు అని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న టిడిపి నాయకులతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పర్యటను విజయవంతం చేయాలన్నారు. ఆ రోజు నిర్వహించనున్న బహిరంగ సభకు, రోడ్‌షోకు మండలంలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. అనంతరం జిఒ నెంబరు ఒకటి నకలు కాపీలను చింపివేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, గ్రామ కమిటీ అధ్యక్షులు కె.మల్లేశ్వరరావు, మండల పార్టీ ప్రచార కార్యదర్శి ఇందుకూరి శ్రీను రాజు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పల రాజు విశాఖ పార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాల ఈశ్వర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరికి హైకోర్టు అడ్డుకట్ట

గజపతినగరం: ప్రభుత్వ వైఖరికి, నిరంకుశత్వానికి జిఒ నెంబర్ 1 రద్దుతో మరొక్కసారి హై కోర్టు అడ్డుకట్ట వేసిందని స్థానిక మాజీ ఎమ్మెల్యే కె.ఎనాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య యుతంగా ఎప్పటి నుండో జరుగుతున్న ప్రదర్శనలకు, నిరసనలకు భరోసా ఈ తీర్పు అని అన్నారు. ప్రశ్నించేవారు లేకపోతే పాలించే వారి చేష్టలకు అడ్డుకట్ట వేసేవారే ఉండరని ఈ రోజు కోర్టు తీర్పు వల్ల పోరాడేవారికి మరింత బలం చేకూరిందని అన్నారు.

టిడిపిలో గ్రూపులు లేవు : గొంప కృష్ణ

శృంగవరపుకోట : నియోజకవర్గం టిడిపిలో గ్రూపులు లేవని టిడిపి యువ నాయకులు గొంప కృష్ణ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌కె ఇనిస్టిట్యూట్‌లో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ టిడిపిలో గ్రూపులు లేవని టీమ్‌లు మాత్రమే ఉన్నాయని, ఈ టీమ్‌లు పార్టీ విజయవంతానికి కృషి చేస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే ఈ నెల 18న చంద్రబాబు నాయుడు చేపట్టే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పర్యటనను విజయవంతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జిఒ నెంబర్ ఒకట రద్దు చేసినందువల్ల 18వ తేదీన జరగబోవు చంద్రబాబు పర్యటన ప్రోగ్రాం రూట్ మ్యాప్ మారే అవకాశం ఉందన్నారు. సోమవారం నాటికి లోకేష్ చేపట్టిన యువగలం పాదయాత్ర వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా వేపాడ మండలం బొద్దం గ్రామం నుండి శృంగవరపుకోట దేవి కూడలి వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర సంఘీభావ పాదయాత్రను నిర్వహిస్తున్నామని ఈ పాదయాత్రలో టిడిపి శ్రేణులు, యువకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గొంప కృష్ణ

డెంకాడ: కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో సైకో పాలన

రేగిడి : రాష్ట్రంలో సైకో పాలన సాగుతోందని మాజీ స్పీకం కావలి ప్రతిభా భారతి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పోరాం గ్రామంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమాలు, దోపిడీలు పెరిగిపోయాయన్నారు. ప్రజల తరుపున అనేక సమస్యలపై టిడిపి నాయకులు మాట్లాడుతుంటే అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ఈ అరాచక పాలనకు ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పి చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామని శిలాఫలకాలు ప్రారంభించడమే తప్ప ఒరిగేదేమీ లేదని విమర్శించారు. రానున్న 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమన్నారు. దీనికి నారా లోకేష్ పాదయాత్రకు వస్తున్న ఆధరణే తార్కాణమయి చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు లావేటి సత్యం నాయుడు, కృష్ణ, శ్రీధర్, నారు జనార్ధన రావు, పల్ల వెంకట్రావు, వంగర మాజీ ఎంపిపి పైల వెంకటరమణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

22న కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఎసరు పెట్టె కార్యక్రమానికి వ్యతిరేకంగా ఈనెల 22న సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యమాన్ని జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు కోరారు. శుక్రవారం అలజంగిలో ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడవద్దని, భయపెట్టి పని నుండి తప్పుకునేటట్లు చేయొద్దని, సమర్థవంతంగా నడిపి కూలీలకు మేలు చేయాలని కోరారు. తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలని, ఒక్క పూటే పని పెట్టాలని, 200 రోజులు పని కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామన్నారు. ఉపాధి రంగంలో వచ్చిన మార్పులు, యంత్రాలతో పనులు పెరుగుదలతో కూలీ రోజులు పడిపోయాయని, వలసలు పోయి బ్రతకాల్సిన దుస్థితి నుండి మార్పు రావాలని ప్రజా సంఘాలు, వామపక్షాలు ఉపాధిహామీ చట్టాన్ని పోరాడి సాధించాయన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతంలో కూలీలు కౌలు రైతులు, రైతులు, నిరుద్యోగులకు కొంత ఊరటగా వంద రోజులు పని దొరికిందన్నారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజల కోరికలు తుంగలో తొక్కిందని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ క్రమంగా ఎత్తివేసేందుకు పూనుకుందని చెప్పారు. తనంతట తానుగా ఉపాధి కూలీలు పని నుండి తప్పుకునే విధంగా నిర్ణయాలు చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం ఇంత దుర్మార్గానికి ఒడికడుతున్నా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి కేంద్రం పై ఒక్కమాట ఆడకపోవడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మణి కుమార్, కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుత్ను గాడి అప్పారావు

ఒక్కపూటే పని పెట్టాలి: వ్యవసాయ కార్మిక సంఘం

కొత్తవలస: జిల్లాలో వ్యవసాయ కూలీలకు ఒక్క పూటే పని పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని కొట్టనవానిపాలెం చెరువులో ఉపాధి కూలీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని పోరాడి తెచ్చుకున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, యంత్రాలతో పనులు చేయించడం వల్ల కూలి రేట్లు పడిపోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్

ఆక్రమణల నుంచి రక్షించాలి

బాడంగి: ప్రభుత్వ చెరువులను ఆక్రమణలు నుండి రక్షించాలని సిపిఎం మండల నాయకులు ఏ. సురేష్ డిమాండ్ చేశారు. కోడూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కంసాల చెరువు, నబ్బోడు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ చెరువులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మామిడి తోటలకు ఆనుకుని ఉన్న చెరువులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ చెరువులను కబ్జా చేస్తున్న సరే రెవెన్యూ అధికారులకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ చెరువుల్లోకి, దళితులు సాగు చేస్తున్న భూముల్లోకి తోవ లేకుండా కంచెలు వేస్తుంటే స్థానిక విలేజ్ రెవెన్యూ అధికారులు దగ్గరుండి వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇప్పటికే కంసాల చెరువు సగభాగం కబ్జాకు గురైందన్నారు. చెరువుల్లోకి వెళ్లకుండా వేసిన కంచెలను వెంటనే తొలగించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో కంచెలను తొలగిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు హరికృష్ణ, కృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

బొబ్బిలి : స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్, న్యాయ అవగాహన సదస్సును న్యాయవాదులు, పోలీసులు, అధికారులు జయప్రదం చేయాలన్నారు. లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలుకు సిద్ధం

ప్రజాశక్తి- రామభద్రపురం

రైతులు పండించిన మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్థానిక మండల వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. ఎంపిపి చొక్కాపు లక్ష్మణ రావు అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సుమారు 800 హెక్టార్లలో 156 మంది మొక్కజొన్న పంట వేసినట్లు రికార్డ్ చేశామన్నారు. దీని ఆధారంగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎంటియూ 1121, సాంబ, సోనా మసూరి వంటి వరి విత్తన రకాలు సకాలంలో పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి ఆవశ్యకత వివరించారు. రైతుల కోరిక మేరకు పివిసి పైపులు రాయతీ ధరకు సరఫరా చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు రసాయన ఎరువులు సకాలంలో రాయతీపై అందించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సలహా మండలి అధ్యక్షులు తవిటి నాయుడు, సభ్యులు, పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు

కొత్తవలస: స్థానిక ఒకటో రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఒ మాధురి శరణ్య ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అధ్యక్షతన జరిగింది. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్. విజయ మాట్లాడుతూ ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం నుంచి పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగా, పిల్లి పెసర అందు బాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విరోతి కొండలరావు మాట్లాడుతూ రైతులు అందరూ రైతు భరోసా కేంద్రం నుంచి అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ముందు రైతులు తమ పొలాల్లో నవధాన్యాలు సాగు చేయాలని, నవధాన్యాలు సాగు వల్ల వేయబోయే పంటకి కావాల్సిన పోషకాలతో అన్ని అందుతాయని అన్నారు. ప్రతి పిఎం కిసాన్ రైతు కూడా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యాన అధికారి ఉమాభరణి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సిహెచ్ హరిప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్ , వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో నడుపూరు గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయడం మంచి పరిణామం అన్నారు. ప్రభుత్వం రైతులు కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని విధాలా ఆదుకుంటు ఒదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్విని యోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, గూడెం పిఎసిఎస్ ఛైర్మన్ రెడ్డి మురళీధర్ రావు, గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

డెంకాడ : వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరో తరగతికి చెందిన జి. కావ్య ప్రథమ, ఐదో తరగతికి చెందిన జ్యోత్స్న ద్వితీయ, కార్తీక్ తృతీయ బహుమతలును సొంత చేసుకున్నారు. విజేతలకు లైబ్రేరియన్ వై. మహేష్ బహుమతులను అందించారు.

పూసపాటిరేగ: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు పి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా విద్యార్థులకు అనేకమైన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇలాంటి పోటీల ద్వారా పిల్లల్లో ఉండే సృజనాత్మకత బయటికి వస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న పిల్లలకు బహుమతులు ఇస్తూ ప్రోత్సాహిస్తున్నామన్నారు. ఈ సమ్మర్ క్యాంపులకు జిల్లా గ్రంథాలయ నిర్వాహకులతో పాటు గ్రామ పెద్దల సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి- జామి

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు బస్సు స్వామినాయుడు మృతికి కారణమైన వారిని శిక్షించి, స్వామినాయుడు కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం దళిత మహాసభ, బిఎస్‌పి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట దళితులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు గంటా అప్పారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పత్రి అప్పారావు, దళిత నేత ఆతవ ఉదయ్‌భాస్కర్, బిఎస్‌పి నేత గాలి చైతన్య కుమార్ తదితరులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మార్చి 20న మరణించిన స్వామినాయుడు కేసు విషయంలో పోలీసుల తీరు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను పట్టుకుని రోజుల అనంతరం కొందరి వత్తిడికి లొంగి వదిలేసారని ఆరోపించారు. పోస్టు మార్టం నివేదికలో మరణించిన వ్యక్తిపేరు కాకుండా ఫిర్యాదు దారుని పేరున నివేదిక ఇచ్చిన జిల్లా వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం డిఎస్‌పి, స్థానిక సిఐలతో ఫోన్‌లో మాట్లాడిన దళిత నేతలు నాలుగు రోజుల్లో మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేపరు పబ్లికేషన్
మహారాజశ్రీ శృంగవరపుకోట
జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S 06/2023

Between:
శ్రీ కొత్తపల్లి ఎర్నిబాబు ....వాది
And:
శ్రీ కొత్తపల్లి వరప్రసాదరావు ....ప్రతివాది

<u>ప్రతివాది చిరునామా:-</u>
శ్రీ కొత్తపల్లి వరప్రసాదరావు, తండ్రి లేటు సింహాచలం, జట్టేడివలస గ్రామం, జామి మండలం, విజయనగరం జిల్లా. A.P

Hg Date :- 18-05-2023

పై నెంబరు దావాలో ప్రతివాది నోటీసు తీసుకొనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 18-05-2023దీన** హాజరు నిమిత్తము **ఉదయం 10-30 ని॥**లుకు ఖుద్దునగాని వకీలు గారు ద్వారా గాని పైన తెల్పిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియపర్చు కొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యిందు మూలముగా ప్రతివాదికి తెలియజేయడమైనది.

" బై కోర్టు ఆర్డర్ "

శ్రీ ఆర్.సత్యనారాయణ
వాది తరుపు న్యాయవాది,
శృంగవరపుకోట,
విజయనగరం జిల్లా.
సెల్: 9550873135